

కలెక్టర్‌ను కలిసిన కమిషనర్, అధికారులు

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సగిలి షాన్ మోహన్‌ను కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు, ఇతర అధికారులు గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఇ పి.సత్యకుమారి, కార్యదర్శి ఎం. ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ గుంటూరు సౌజన్య, స్మార్ట్ సిటీ ఎస్ఇ ఎం.వెంకటరావు, డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాస్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఇఇ మాధవి, వివిధ విభాగాధిపతులు ఉన్నారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కమిషనర్

నిధుల్లేక నిట్టూర్పు

- గ్రామాల్లో విజృంభిస్తున్న డయేరియా
- పొంచి ఉన్న డెంగీ, విష జ్వరాల ముప్పు
- కానరాని అపారిశుధ్య నివారణ పనులు
- విలవిలలాడుతున్న పంచాయతీలు



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించాల్సి వచ్చింది. డయేరియా విజృంభిస్తున్న తరుణంలో నెలలో రెండుసార్లు వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించాం. చెత్త కుప్పలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అయితే గత ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను దారి మళ్ళించడంతో పంచాయతీలో పూర్తిస్థాయిలో ప్రజారోగ్య కార్యక్రమాలు చేయడానికి నిధులు లేకుండా పోయాయి. సాధారణ నిధులూ అందుబాటులో లేవు. శానిటేషన్ వర్కర్లకు కొన్ని నెలలుగా వేతనాలు కూడా ఇవ్వడం లేదు. నిధులు లేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం అని పిఠాపురం మండలంలోని ఒక గ్రామ సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా పలు పంచాయతీలు ఈ సమస్యను ఎదుర్కొంటున్నాయి.

ప్రస్తుతం వర్షాకాలం సీజన్ నేపథ్యంలో పలు గ్రామాల్లో వర్షపు, మురుగునీరు నిల్వ ఉండిపోవడం వల్ల దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. వీటి వలన వ్యాధులు ముసురుతున్నాయి. విష జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. ఇప్పటికే తొండంగి, సామర్లకోట, యు.కొత్తపల్లి తదితర మండలాల్లో డయేరియా విజృంభించింది. డయేరియా బారినపడి వ్యాధి తీవ్రత ముదరడంతో ఇద్దరు మహిళలు మరణించడం కలకలం రేపింది. మరోవైపు డెంగీ వచ్చే ప్రమాదం పొంచి ఉంది. ఈ నేపథ్యంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచాల్సిన పంచాయతీలు నిధుల లేక కొట్టుమిట్టాడుతున్నాయి. చేసేదేమీ లేక సర్పంచులు తలలు పట్టుకునే పరిస్థితి ఏర్పడింది.

నిధులు లేక ఇక్కట్లు

కాకినాడ జిల్లా పెద్దాపురం డివిజన్‌లో 213 పంచాయతీలు, కాకినాడ డివిజన్లో 172 పంచాయతీలున్నాయి. మొత్తం 385 పంచాయతీలుండగా మెజారిటీ గ్రామాల్లో పారిశుధ్యం అధ్వాన్నంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లావ్యాప్తంగా గత రెండు రోజులుగా వర్షాలు ఎక్కువగా కురుస్తున్నాయి. ఎక్కడికక్కడ మురుగునీరు నిలిచిపోవడంతో దోమలకు నిలయాలుగా మారాయి. పలు ప్రాంతాల్లో చెత్త కుప్పలు దర్శనమిస్తుండడంతో ప్రజలు రోగాలతో సతమతమవుతున్నారు. ప్రస్తుతం డయేరియా వ్యాప్తి ఎక్కువగా ఉంది. వందల సంఖ్యలో కేసులు వెలుగులోకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాగునీటిని సక్రమంగా అందించడంతోపాటు పారిశుధ్యాన్ని మెరుగు పరచవలసిన బాధ్యత పంచాయతీలపై ఉంది. కానీ నిధులు లేని సమస్యతో కొట్టుమిట్టాడుతున్న గ్రామ పంచాయతీలు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడానికి ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలోకి నెట్టబడ్డాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో మొదటి విడతలో రూ.1257 కోట్లు, రెండో విడతలో రూ.26.72 కోట్లు కేంద్రం 15వ ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు విడుదల చేసింది. ఈ నిధుల నుంచి 30 శాతం సిబ్బంది జీతాలకు, 50 శాతం విద్యుత్ బిల్లులకు 20 శాతం శానిటేషన్ నిర్వహణకు ఖర్చు చేయాల్సి ఉంది. వీటిని ఆయా పంచాయతీ ఖాతాలకు జమ చేయాల్సిన గత ప్రభుత్వం ఇతర కార్యక్రమాలకు దారి మళ్లించడంతో సమస్యలు తలెత్తాయి. దీనిపై అనేకసార్లు సర్పంచులు మొరపెట్టుకున్న ప్రభుత్వం లెక్క చేయలేదు. అంతే కాకుండా గ్రామ సచివాలయాల నిర్వహణ బాధ్యతను సైతం పంచాయతీలకు అప్పగించింది. దాంతో మౌలిక సదుపాయాలు కల్పించలేక నేటికీ అనేక పంచాయతీలు సతమతమవుతున్నాయి. మేజర్ పంచాయతీల్లో కాస్త ఇబ్బందులు లేకపోయినా మైనర్ పంచాయతీలు ఎక్కువగా నిధులు లేమితో ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. కనీసం పారిశుధ్య సిబ్బందికి జీతాలు ఇవ్వలేని దుస్థితికి చేరాయి. దీంతో ప్రస్తుతం వ్యాధులు ముసురుతున్న వేళ పలువురు ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు.

సిబ్బంది జీతాలకూ వెతలే...

పారిశుధ్య నిర్వహణలో భాగంగా సిబ్బంది జీతాలు, బ్లీచింగ్, ముగ్గు, కాలువల్లో సీల్ట్ తొలగింపు తదితర పనులను కొన్ని పంచాయతీలు సాధారణ నిధుల నుంచి వినియోగిస్తున్నారు. సాధారణ నిధులు లేని పంచాయతీలు మాత్రం పరిశుధ్య నిర్వహణను గాలికి వదిలేసినట్లు ఆయా గ్రామస్తులు విమర్శిస్తున్నారు. సాధారణ నిధులు సరిపోని నేపథ్యంలో అనేక పంచాయతీల్లో గ్రీన్ అంబాసిడర్లకు, ఇతర సిబ్బందికి 6 నుంచి 9 నెలలు వేతనాలు పెండింగ్లోనే ఉన్నాయి. ఆర్థిక సంఘం నిధులను ఎక్కువగా పారిశుధ్య నిర్వహణకే ఖర్చు చేయాల్సి ఉంది. అయితే వాటిని రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిన నేపథ్యంలో గ్రామాల్లో శానిటేషన్ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఈ నేపథ్యంలో నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వం పంచాయతీలకు ప్రత్యేక నిధులను కేటాయించి ప్రజా ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయాల్సిన అవసరం ఉంది. పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఉన్న జనసేన అధినేత, పిఠాపురం ఎంఎల్ఎ పవన్ కళ్యాణ్ పంచాయితీల నిధులు, విధులపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.



ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్

'ఉపాధి'కి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

-అధికారులను ఆదేశించిన కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ

జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో వివిధ శాఖల్లో అవసరమైన పనులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయా కలెక్టర్ సగిలి షాన్ మోహన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశం జరిగింది. గ్రామ పంచాయతీలలో ఇంటి పన్నుల సేకరణ, జిల్లాలో అన్ని మండలాలు, జిల్లా పరిషత్ వారిగా 15వ ఆర్థిక సంఘం, సాధారణ నిధులతో చేపట్టిన పనులు, ఖర్చులు వాటి వివరాలు, ఉపాధి హామీ పథకం పనిదినాల సంఖ్య, అమత్ సరోవర్ పనుల వివరాలు వంటి అంశాలపై జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని మండలాలు, జిల్లా పరిషత్ వారిగా 15వ ఆర్థిక సంఘం, సాధారణ నిధులతో చేపట్టిన పనులు, ఖర్చులు వాటి వివరాలను ఈ నెలాఖరులోగా సమర్పించాలన్నారు. ఉపాధి హామీ పథకం నిధులతో వ్యవసాయం, పశు సంవర్ధక, ఉద్యానవన, ఐసిడిఎస్, పంచాయతీరాజ్ తదితర శాఖల్లో అవసరమైన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, డిపిఒ కె.భారతి సౌజన్య, పశుసంవర్ధక శాఖ జెడి ఎస్.సూర్య ప్రకాశరావు, జడ్‌పి డిప్యూటీ సిఇఒ జివిఎస్.రామ్ గోపాల్, ఉద్యాన శాఖ అధికారి మల్లిఖార్జునరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ ఎం.శ్రీనివాసు, పంచాయతీరాజ్ ఇఇ జి.మల్లిఖార్జున, కాకినాడ, పెద్దాపురం డిఎల్‌డిఒలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎ నానాజీని కలిసిన సిఐటియు నేతలు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

కాకినాడ రూరల్ నియోజకవర్గ ఎంఎల్ఎ పంతం నానాజీని సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షులు జి.బేబిరాణి ఆధ్వర్యంలో సిఐటియు బృందం గురువారం ఆయన నివాసంలో కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బేబిరాణి మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, అంగన్‌వాడీ, ఆశా, విఒఎ, మధ్యాహ్న భోజన పథకం వంటి స్కీం వర్కర్స్ వేతనాలు, పదోన్నతులు, ఉద్యోగ భద్రత వంటి అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎంఎల్ఎ నానాజీ మాట్లాడుతూ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు దువ్వా శేషబాబ్జీ, చెక్కల రాజ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కె.సత్తిరాజు, జిల్లా కోశాధికారి మలక వెంకటరమణ, నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, రూరల్ సిఐటియు నాయకులు ఎం.వెంకటరమణ, టి.రాజా, మధ్యాహ్న భోజన పథకం నాయకురాలు ఈశ్వరి, అంగన్‌వాడీ నాయకులు రమణమ్మ, వీరమణి, వరలక్ష్మి, వీరవేణి, ఆశా యూనియన్ నాయకులు బేబి, విమల, స్వర్ణ సుజాత పాల్గొన్నారు.



ఎంఎల్ఎ నానాజీని అభినందిస్తున్న బేబిరాణి



ఫ్యాక్టరీ వద్ద అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న కార్మికులు

రాక్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి - సామర్లకోట

తక్షణమే తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాక్ సిరామిక్స్ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. రాక్ సిరామిక్స్ గేటు వద్ద కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమాలు గురువారం నాటికి 15వ రోజుకు చేరుకున్నాయి. ఈ నిరసనలో సిఐటియు ఉపాధ్యక్షులు నీలపాల సూరిబాబు మాట్లాడుతూ రాక్ సిరామిక్స్ యాజమాన్యానికి కార్మికుల తొలగింపు అనేది అలవాటుగా మారిపోయిం దన్నారు. పర్మినెంట్ వర్కర్లను తొలగించి కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ వర్కర్లను జాయిన్ చేసుకుంటున్నారని అన్నారు. నష్టాల పేరుతో అబద్దాలు చెబుతూ కార్మిక చట్టాలను అమలు చేయకుండా జాయింట్ లేబర్ కమిషనర్ మాటను కూడా ఖాతారు చేయకుండా యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తుందన్నారు. తక్షణం కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని లేనిపక్షంలో అన్ని రంగాల కార్మికులతో కలిపి గేటు ముందు ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి డి.క్రాంతికుమార్, సామర్లకోట సిఐటియు కార్యదర్శి సురేష్, పెద్దాపురం సిఐటియు అధ్యక్షులు గడిగట్ల సత్తిబాబు, ప్రజానాట్యమండలి కళాకారులు కృష్ణ, వీర్రాజులు ఆందోళనకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, గంగాధర్, సతీష్, రామకృష్ణ, వరప్రసాద్, మల్లికార్జున రావు, గంగాధర్, క్రాంతి, మంగారావు, అర్జున్ రావు, మూర్తి, సత్యనారాయణ, చంద్రన్న, ప్రభుదాస్, రామచంద్రయ్య, రాజబాబు, సతీష్‌కుమార్, శివనారాయణ, సుబ్బారావు పాల్గొన్నారు.

రుణార్హత కార్డుల జారీపై అవగాహన

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని కౌలు రైతులకు సంబంధించిన రుణ అర్హత కార్డు జారీపై తహశీల్దార్ విద్యాపతి, వ్యవసాయ అధికారి రెడ్డి ఈశ్వరరావు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది క్షేత్ర స్థాయిలో ఆయా గ్రామాల్లో కౌలుకు సాగు చేసుకుంటున్నా రైతులను గుర్తించి కౌలు రైతుల ఎంపిక కార్యక్రమాన్ని క్షుణ్ణంగా పరిశీలించి రుణ అర్హత కోర్టులు జారీ చేయాలని సూచించారు. ఎక్కడా ఏ లోపం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.13.93 కోట్ల లాభాల్లో టౌన్ బ్యాంక్: ఛైర్మన్

ప్రజాశక్తి - కాకినాడ

ది కాకినాడ కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు లిమిటెడ్ రూ.13.93 కోట్ల లాభాలను ఆర్జించిందని బ్యాంకు ఛైర్మన్ చిట్టూరి రవీంద్ర వెల్లడించారు. గురువారం స్థానికంగా ఓ ప్రయివేటు హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బ్యాంకు 45వ వార్షిక ఆడిట్ నివేదిక వివరాలను వివరించారు. వినియోగదారుల సౌకర్యార్థం కోసం రానున్న కాలంలో నర్సీపట్నం, నూజివీడు, విజయనగరం, శ్రీకాకుళం, భీమవరం, పిఠాపురంలలో నూతన బ్రాంచ్‌లను ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్లు చెప్పారు. ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి రూ.1056 బ్యాంక్ డిపాజిట్లుగాను రూ.696 కోట్లు రుణాలు, వడ్డీ రూ.447 కోట్ల ఉన్నట్లు చెప్పారు. బ్యాంకుకు రూ.172 కోట్ల సొంత నిధులు ఉన్నట్లు చెప్పారు. ప్రతీ ఖాతాదారుడు పాన్‌కార్డు, ఆధార్ కార్డు లింక్ చేసుకోవాలని, అలా చేయడం వల్ల ఎటువంటి రుసుం బ్యాంకు నుంచి వసూలు కావన్నారు. బంగారు వస్తువులపై ఒక వ్యక్తికి రూ.4 లక్షల వరకూ ఇస్తామని, దీనికి ఎటువంటి ఛార్జీలు ఉండవన్నారు. తమ బ్యాంకు ఆయా బ్రాంచీల పరిధిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందిస్తున్నట్లు చెప్పారు. బ్యాంకుకు 53,360 మంది సభ్యులు ఉన్నారన్నారు. బ్యాంకులో ఒక వ్యక్తికి అత్యధికంగా రూ.2 కోట్ల వరకూ రుణాన్ని ఇస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో 46 సహకార కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులు ఉండగా ఈ టౌన్ బ్యాంకు రూ.1753 కోట్ల టర్నోవర్లతో రెండో స్థానంలో ఉందని వివరించారు. ఈ సమావేశంలో బ్యాంక్ వైస్ ఛైర్మన్ తోట మెహర్‌సీతారామసుధీర్, డైరెక్టర్లు కంటిపూడి వివి.సత్యనారాయణ, రిమ్మలపూడి ధర్మేంద్ర, సిఇఒ సి.సుగుణ రావు, సహాయ సిఇఒ బివిఎస్‌వి.సుహాస్, బ్యాంక్ సిబ్బంది, పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చిట్టూరి రవీంద్ర

సీజ్ చేసిన మద్యం ధ్వంసం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

మద్యాన్ని అనధికారికంగా తరలించే వారి నుంచి స్వాధీనం చేసుకున్న మద్యాన్ని సెబ్, పోలీసు అధికారుల సమక్షంలో ధ్వంసం చేశారు. గురువారం రూరల్ మండలం సూర్యారావు పేట గ్రామం ఎన్‌టిఆర్ బీచ్ ఆర్ అండ్ బి అతిథి గృహం రోడ్డులో ఎన్నికల కోడ్ సమయంలో స్వాధీనం చేసుకున్న మద్యంతో పాటు, గత రెండేళ్ల కాలంలో వివిధ కేసుల్లో పట్టుబడిన స్వాధీనం చేసుకున్న మద్యాన్ని రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. జిల్లా ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్, సెబ్ ఎఎస్‌పి శ్రీలక్ష్మి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి సతీష్‌కుమార్ మాట్లాడుతూ గత రెండేళ్లలో జిల్లాలో ఐడిపిఎల్, డిపిఎల్, ఎన్‌డిపిఎల్ కేసులకు సంబంధించి 1406 అక్రమ మద్యం తరలింపు కేసులు నమోదు చేసి, 94 వేల 737 మద్యం బాటిళ్లకు సంబంధించి సుమారు 33 వేల లీటర్లను సీజ్ చేసినట్లు తెలిపారు. 12 వేల 533 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. పట్టుబడిన మద్యం విలువ రూ.1 కోటి 65 లక్షల 69వేల రూపాయలు ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సెబ్ సూపరింటెండెంట్ జె.రవికుమార్, అసిస్టెంట్ సెబ్ సూపరింటెండెంట్ ఎ. శ్రీరంగందొర, జిల్లాకు చెందిన సెబ్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మద్యం బాటిల్స్‌ను తొక్కుతతున్న రోడ్డు రోలర్

ఇమ్యూనైజేషన్ బృందం పరిశీలన

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలో డయేరియా కేసుల నమోదైన క్రమంలో డిస్ట్రిక్ట్ ఇమ్యూనైజేషన్ అధికారి కె.రత్న కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ సిహెచ్.శ్రీనివాసు, మునిసిపల్ కమిషనర్ జె.రామా రావు గురువారం ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించారు. తొలుత ఆసుపత్రిలో చికిత్స పందుతున్న రోగుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో టిడిపి పట్టణ అధ్యక్షులు అడబాల కుమారస్వామి, కౌన్సిలర్ బలుసు వాసు పాల్గొన్నారు.



బాధితుడితో మాట్లాడుతున్న అధికారులు


జొన్నలదొడ్డిలో అతిసారా కేసులు నిల్

మండలంలోని వేట్లపాలెం శివారు జొన్నలదొడ్డి ప్రాంతంలో గురువారం ఒక్క అతిసార కేసు కూడా నమోదు కాలేదని వేట్లపాలెం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ వై.హిమావతి, డాక్టర్ పార్దేశ్ వెల్లడించారు.

ఉపాధి బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఉపాధి హామీ పనులకు సంబంధించిన బకాయి వేతనాలను తక్షణమే కూలీలకు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం పటవల గ్రామ పంచాయతీ వద్ద ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా సామాజిక తనిఖీ ప్రత్యేక అధికారి, ఎంఇఒ ఎ.మంగాయమ్మ, పంచాయతీ కార్యదర్శి రమణమ్మలకు కూలీలతో కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ చట్ట ప్రకారం రాజీలేని అంశాలను కచ్చితంగా అమలు చేయవలసిన బాధ్యత ప్రభుత్వాలపైన ఉందన్నారు. పనిచేసిన 15 రోజులకు వేతనాలు తప్పనిసరిగా ఇవ్వాలని, తాగునీరు, మెడికల్ కిట్లు తప్పనిసరిగా పని ప్రదేశంలో కల్పించాలన్నారు. వేతనం రూ.300 ఇవ్వాల్సివుందన్నారు. అయితే ఇవేమి అమలు కావడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఉపాధి కూలీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మందనక్క తణుకురాజు, దోణం సునీత, పులపకూర కష్ణ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు



అధికారికి వినతిపత్రం ఇస్తున్న ఈశ్వరరావు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - పెద్దాపురం

సీజనల్ వ్యాధుల పట్ల అధికార యంత్రాంగంతోపాటు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ జి.ఉషారాణి అన్నారు. గురువారం మండలంలోని జి.రాగంపేట, వడ్లమూరు, గోరింట గ్రామాల్లో మంచినీటి సరఫరా ట్యాంకులు, పైపులైన్లను ఇఒపిఆర్‌డి కె.రాజశేఖర్‌తో కలిసి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో మంచి నీటి కాలుష్యం వల్లనే రోగాలు ఎక్కువగా ప్రభలే ప్రమాదం ఉందన్నారు. అధికారులు, సిబ్బంది ప్రతి గ్రామంలో మంచినీటి సరఫరా ట్యాంకులు, స్పాట్ డెలివరీ ట్యాంకులు, పైపులైన్లు ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి సిబ్బందిని అప్రమత్తం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీల కార్యదర్శులు రమేష్, కళ, సచివాలయ ఇంజనీరింగ్ అధికారులు, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

బాబీకి రోటరీ క్లబ్ సత్కారం

ప్రజాశక్తి - తాళ్లరేవు


పలుమార్లు రక్తదానం చేయడమే కాకుండా, రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసినందుకు సామాజిక కార్యకర్త ధూళిపూడి వెంకటరమణను కాకినాడ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ పిడిజి ఎస్‌విఎస్.రావు, రోటరీ బ్లడ్ బ్యాంక్ ఛైర్మన్ రామకృష్ణ, పసుపులేటి కామరాజు, కార్యదర్శి వర్మ, ట్రెజరర్ వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

జూలై 1న హుండీల ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలానికి చెందిన తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామి ఆలయ హుండీల్లో ఆదాయాన్ని జూలై 1న లెక్కిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ నియమించిన అధికారులు, పోలీస్‌ల సమక్షంలో హుండీలను తెరిసి లెక్కింపు జరుపుతారన్నారు.

కార్టూ'నిజం'



200 మందికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - సామర్లకోట

శారద రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం కాకినాడ శ్రీ కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యులు మండలంలోని పెదబ్రహ్మదేవం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గురువారం జరిగిన వైద్య శిబిరంలో సుమారు 200 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్ తెలిపారు. తన సోదరుడు సమితి సభ్యుడు తోటకూర వీర వెంకట సత్యనారాయణ పుట్టినరోజు సందర్భంగా మెగా కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పెదబ్రహ్మదేవం గ్రామంతోపాటు, ఇల్లపల్లి, రంగాపురం, మేడపాడు, మర్రిపూడి, తుమ్మలపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు వైద్య సేవలు అందుకున్నారని తెలిపారు వీరిలో 40 మందికి శస్త్ర చికిత్స కోసం కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రికి తరలిస్తామన్నారు. ఈ శిబిరాన్ని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయి రామకృష్ణ రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. క్యాంపు ఇన్‌ఛార్జి సత్యనారాయణ ఆధ్వర్యంలో డాక్టర శ్రీవల్లి, సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు మలకల వరాలబాబు, టిడిపి మండల అధ్యక్షుడు తోటకూర శ్రీనివాస్, పంచాయతీ సభ్యులు తోటకూర దుర్గాలక్ష్మి, సేవా సమితి కార్యదర్శి వింజమూరి విశ్వనాథం, సభ్యులు పాల్గొన్నారు.



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వాకింగ్ ట్రాక్ స్థల పరిశీలన

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

వాకతిప్పలో బావయ్య చెరువు దగ్గర వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేసేందుకు ఫారెస్టు అధికారులు గురువారం స్థల పరిశీలన చేశారు. జిల్లా అటవీ శాఖ అధికారి భరణి, ఎస్ఎఫ్ఎస్ డివిజనల్ అధికారి అనూష వాకతిప్ప గ్రామంలో ఉన్న బావయ్య చెరువు గట్టును పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎఫ్ఒ భరణి మాట్లాడుతూ వాకింగ్ ట్రాక్ కోసం స్థలాన్ని పరిశీలించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే 5చోట్ల స్థలాల్ని పరిశీలించామని, ప్రభుత్వం నిర్దేశించిన ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ పర్యటనలో ఎఫ్ఆర్ఒ పద్మజ, ఎఫ్ఎస్ఒ నాగార్జున, జనసేన నాయకులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డిఎఫ్ఒ

కొత్త చట్టాల అమలును ఆపాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

కేంద్ర ప్రభుత్వం జూలై 1 నుంచి అమల్లోకి తేనున్న కొత్త న్యాయ చట్టాలు అమలు ఆపాలని కోరుతూ న్యాయవాదులు ప్రత్తిపాడు కోర్టు ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బుగత శివన్నారాయణ మాట్లాడుతూ పాత చట్టాలు రద్దు చేసి నూతన చట్టాలు అమలుపై రాజ్యాంగపరమైన అనుమానాలు వ్యక్తం అవుతున్న దృష్ట్యా చట్టాల అమలను వాయిదా వేయాలన్నారు. నూతన చట్టాలపై న్యాయమూర్తులు, న్యాయవాదులు, నేర దర్యాప్తు సంస్థలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా అధ్యయనం చేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు దేవి, బలరాముడు, శ్రీనివాసరావు, కామేశ్వరరావు, ఆర్.వెంకటరెడ్డి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న న్యాయవాదులు

నేరాలు ఘోరాలు



లారీ టైరు కింద నలిగిపోయిన మృతదేహం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని నీలాద్రిపేట జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు వివరాల ప్రకారం..ఏలేశ్వరం మండలం లింగంపర్తి గ్రామానికి చెందిన చంద్రపాటి లావరాజు(44) మండలంలోని మల్లేపల్లిలో జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం మోటార్ సైకిల్‌పై పామాయిల్ గెలల కోసేందుకు లింగపర్తి వెళ్లి పని ముగించుకుని తిరిగి మల్లేపల్లి వస్తుండగా నీలాద్రి రావు పేట సమీపంలో వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతనికి బలమైన గాయాలు కావడంతో మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదుపై ఎఎస్ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు,



రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న వ్యాన్

బస్సు, వ్యాన్ ఢీకొని ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - నల్లజర్ల

ఆర్‌టిసి బస్సు, వ్యాన్ ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో వ్యాన్‌లోని ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన నల్లజర్లలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు నల్లజర్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నల్లజర్ల శివారు విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో ఏలూరు నుండి రాజమండ్రి వెళుతున్న ఆర్‌టిసి బస్సును నల్లజర్ల వైపు నుండి ఏలూరు జిల్లా గాలాయగూడెంకు వెళుతున్న బొలోరో వ్యాన్ రాంగ్ రూట్లో బస్సుకు ఎదురుగా వచ్చి ఢీకొంది. అనంతరం పక్కన ఉన్న రేకుల షెడ్డు ఢీకొని పంట కాలవలోకి వెళ్ళింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న 55 మంది ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారు. ప్రయాణికులను వేరే బస్సుల్లో తరలించారు. ఈ క్రమంలో బస్సులో ముందు సీట్లో కూర్చున్న మహిళకు కాలు బెణకడంతో స్థానిక పిహెచ్సి నందు ఫస్ట్ ఎయిడ్ అనంతరం ఆమెను పంపించి వేశారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన వ్యాన్లోని వ్యక్తులను 108లో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

మొక్కులు తీర్చుకున్న నెహ్రూ అభిమానులు

ప్రజాశక్తి-గోకవరం

ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూకు భారీ విజయం దక్కడంతో జగ్గంపేట నియోజకవర్గంలో ఊరూరా నెహ్రూ అభిమానులు పెద్ద ఎత్తున మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఇందులో భాగంగా నెహ్రూ అనుచరుడు టిడిపి గోకవరం మండలం తంటికొండ గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగం వెంకటపతి శ్రీవారి మెట్ల మార్గం ద్వారా 2,388 మెట్లు కాలినడక ఎక్కి వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరావు, వెంకటేష్ పాల్గొన్నారు.

శ్రీనివాస్ కుమార్తె వివాహానికి నవీన్

ప్రజాశక్తి-గోకవరం

మండల కేంద్రమైన గోకవరం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు పాలాడి శ్రీనివాస్ కుమార్తె వివాహానపికి పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ హాజరయ్యారు. గురువారం గోకవరంలో స్థానిక సూర్య ఫంక్షన్ హాల్లో ఈ కార్యక్రమంలో జ్యోతుల నవీన్ కుమార్ పాల్గొని వధూవరులు ఆషిక జోషి, వీర ప్రభువులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రభుత్వ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

90 రోజుల విద్యా ప్రణాళికపై దృష్టి

ప్రజాశక్తి - సామర్లకోట

పాఠశాలల్లో 90 రోజుల విద్యా ప్రణాళికను విధిగా ఉపాధ్యాయులు పాటించాలని ఎంఇఒ-1 వై.శివ రామకృష్ణయ్య అన్నారు. గురువారం మండలం లోని పనసపాడు ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శిం చారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం, పరిసరాల శుభ్రత, మంచినీటి వసతి, మరుగుదొడ్ల నిర్వహణ పరిశీలించారు. అలాగే పాఠశాలలో విద్యార్థుల ప్రగతిని తెలుసుకున్నారు. భాషా నైపుణ్యాలు, చతుర్విధ ప్రక్రియలు ఎలా ఉన్నాయనే విషయంపై, వర్క్‌బుక్, నోట్‌బుక్స్‌ను పరిశీలించారు. ఉదయం విశ్రాంతి సమయంలో విద్యార్థులకు పోషకా హారంగా ఇచ్చే వేరుశనగ చిక్కీ, రాగిజావలపై ఆరా తీశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి భోజనం రుచిచూశారు. ప్రస్తుతం జరుగుతున్న అడ్మిషన్ నమోదు, డ్రైవ్ వేగవంతం చేసి 90 రోజుల విద్యా ప్రణాళిక అమలును పరిశీలించారు. బడి ఈడు పిల్లలను బడిలో నమోదుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థుల స్థాయిని తెలుసుకుంటున్న ఎంఇఒ

1న ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ

రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జూలై 1న ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ సగిలి షాన్ మోహన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో డిఆర్‌డిఎ, మెప్మా అధికారులతో సమావేశం నిర్వహించారు. జూలై నెలలో చేపట్టబోయే ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ పంపిణీ ప్రణాళిక, చంద్రన్న బీమా క్లెయిమ్స్ పరిష్కారం, స్త్రీ నిధి, ఉన్నతి, సున్నా వడ్డీ కింద మంజూరు చేసిన రుణాలు వివరాలు, స్వయం సహాయక సంఘాలు, సభ్యులకు స్వయం ఉపాధి నిమిత్తం కల్పిస్తున్న సదుపాయాలు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక భద్రత పింఛన్లను రానున్న జూలై నెల నుంచి ఎన్‌టిఆర్ భరోసా పేరుతో పంపిణీ చేపట్టనున్నదన్నారు. జూన్ నెలలో సామాజిక భద్రత పింఛన్ల కింద జిల్లాలో 2,79,805 మందికి రూ.82.90 కోట్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జూలై నెలలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఎన్‌టిఆర్ భరోసా పేరుతో 17 రకాల పింఛన్లు జిల్లాలో 2,79,319 మందికి రూ188.40 కోట్ల పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి మూడు వేలు, నూతనంగా పెంచిన పింఛన్ సొమ్ము రూ.4 వేలతో కలిపి మొత్తం రూ.7 వేలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జూలై 1న గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితో పింఛన్ సొమ్ము సకాలంలో పంపిణీ చేసేలా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. ఇందుకు కిందిస్థాయి సిబ్బందికి స్పష్టమైన సూచనలు తెలియజేసి, సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలో 39,532 స్వయం సహాయక సంఘాల్లో 4.08 లక్షల మంది సభ్యులుగా ఉన్నారని ఆయన తెలిపారు. వారికి మంజూరు చేసే స్త్రీనిధి, ఉన్నతి, సున్నా వడ్డీ కింద మంజూరు చేసే రుణాలు, రికవరీలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ అధికారులు స్వయం ఉపాధి మార్గాలపై స్వయం సహాయక సంఘాల మహిళలకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ కె.శ్రీరమణి, మోప్మా పీడీ బి.ప్రియంవద, డిపిఎంలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



'డయేరియా వ్యాప్తిని నిరోధించేందుకు చర్యలు'

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో డయేరియా వ్యాధి పట్ల ప్రజలెవరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదని, డయేరియా నియంత్రణకు అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ సగిలి షాన్ మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని గ్రామాలు, మున్సి పాలిటీలతోపాటు వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో మంచి నీరు ట్యాంకులకు క్లోరినేషన్ ప్రక్రియ నిర్వహించడం జరుగు తుందన్నారు. తాగునీటి పరీక్షలు నిర్వహి స్తున్నామని, తాగునీరు పైపులైన్ల తనిఖీ, లీకేజీలు, మరమ్మతుల పనులు చేపట్టామని కలెక్టర్ తెలిపారు. మంచినీరు ట్యాంకుల క్లోరినేషన్ ప్రక్రియ, గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిరం తరం రోజుకు రెండుసార్లు చొప్పున సాగుతు న్నాయని చెప్పారు. జిల్లాలోని అన్ని గ్రామాలలో మెడికల్ క్యాంపులు నిర్వహించి, ఐరన్ టాబ్లెట్లు, ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు అందించడం జరుగుతుందని తెలిపారు. గ్రామాలలో ఇంటింటికి సర్వే నిర్వ హించి ఎవరికైనా వాంతులు, విరేచనాలు అయ్యే అవకాశం ఉంటే వారిని గుర్తించి వారికి మందులు అందించడం జరుగుతుందన్నారు. కొన్నిచోట్ల డయేరియా అనుమానం కేసులను ఆసుపత్రిలో చేర్చడం జరుగుతుందని, వారికి ఎటువంటి ప్రమా దం లేదని, ముందు జాగ్రత్త చర్యగా మాత్రమే వారిని ఆసుపత్రిలో చేర్చడం జరుగుతుందని వివరించారు. డయేరియా వ్యాధి ప్రబలకుండా ప్రజలు కాచి చల్లార్చిన వేడి నీళ్లు మాత్రమే తీసుకోవాలని, ఇంటిలోనూ, పరిసర ప్రాంతాల్లో శు భ్రంగా ఉంచుకోవడం తోపాటు, మంచినీటి నిల్వచేసే బిందులు, డ్రమ్ములను కూడా శుభ్రం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఇల్లు లేని నిరుపేదలకు స్థలాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట గ్రామంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఎపి రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో జగ్గంపేటలో సుమారు 2వేల మందికి ఇళ్ల స్థలాలు కేటాయిం చారని, అయితే ఇదే గ్రామంలో 500 మంది వరకూ ఇళ్లు లేని పేదలు ఉన్నారన్నారు. కావున తక్షణమే జగ్గంపేట గ్రామంలో జగనన్న కాలనీ ఆనుకుని ఉన్న స్థలాన్ని వీరికి కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు కడితి సతీష్, కె.రామలింగేశ్వరరావు, దేశెట్టి సురేష్, ఎల్లే సత్తిబాబు,నాగమణి పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న లైన్స్‌క్లబ్ ప్రతినిధులు

ఘనంగా హెలెన్ కిల్లర్ జయంతి

ప్రజాశక్తి - యానాం

స్థానిక ఫెర్రీ రోడ్‌లో ఉన్న ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో హెలెన్ కిల్లర్ 144వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం జరిగిన ఈ కార్య క్రమానికి ఇన్‌ఛార్జ్ కె.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. వాసవి ఉమెన్స్ క్లబ్ ప్రెసిడెంట్ సిహెచ్ సర్వలక్ష్మి పాల్గొని మాట్లాడారు. హెలెన్ కిల్లర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ బి.కాశీఅన్నపూర్ణ, ట్రెజరర్ పి.సరస్వతి, సభ్యులు బి.శీతల్, మహాలక్ష్మి, సి హెచ్.నాగలక్ష్మి, బి.తోషిత, కె.వెంకటలక్ష్మి, సూర్యనారాయణ, సుధాకర్, ఎం.సుశీల, కె.మహేశ్వరి, డి.వీరవేణి పాల్గొన్నారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగ ఉండాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీత పిలుపునిచ్చారు. గురువారం కళాశాల విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాంలో భాగంగా మాదకద్రవ్యాల వినియోగం తరలింపుపై నిర్వహించిన వ్యాసరచనలో విజేతలకు బహుమతులు ప్రధానం కార్యక్రమం జరిగింది. మొదటి బహుమతి పి.రాజ్‌కుమార్, రెండో బహుమతి యు. సుసన్నారాణి, మూడో బహుమతి యు.మహేష్ గెలుపొందినట్లు ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రగడ ప్రయాగమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రామారావు, శ్రీలక్ష్మి, సురేష్, శివప్రసాద్, మదీనా, బంగార్రాజు, పుష్ప, సిబ్బంది పాల్గొన్నారు.

మనోవేదనకు చికిత్స అవసరం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

ప్రకృతి వైపరీత్యాలు, కారు ప్రమాదాలు, లైంగిక వేధింపుల వంటి ప్రాణాంతక సంఘటనల అనుభవాలు తర్వాత వచ్చే మనో వేదనను చికిత్స ద్వారా నయం చేయవచ్చని డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. గురువారం బోటు క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ మనోవేదన నివారణ దినోత్సవం పురస్కరిం చుకుని అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దురదృష్టకరమైన సంఘటనలకు సంబంధించి జ్ఞాపకాలు చాలా కాలం వరకు వెంటాడుతాయని అన్నారు. అటువంటివారు నిస్పృహకు లోన వ్వడం, ఆందోళన చెందడం, మత్తు పదార్థాలకు అలవాటు పడతారని అన్నారు. వీరికి మందుల ద్వారా చికిత్స అందిస్తే కొద్ది ఆలస్యమైనా తేరుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ సదస్సులో అడబాల రత్నప్రసాద్, రాజా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడతున్న డాక్టర్ వెంకటరమణ

తిమ్మాపురంలో నేను బడికి పోతా...

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని జె.తిమ్మాపురం గ్రామంలో నే బడికి పోతా ర్యాలీ నిర్వహించారు. బడి ఈడు పిల్లలు అందరిని బడిలో చేర్చాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను బడిలో చేర్పించాలని అవగాహన కల్పించారు. అలాగే అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎన్.ఉమాదేవి ఆధ్వర్యంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని సీజనల్, అతిసార వ్యాధులపై మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన గ్రాడ్యుయేషన్ డేలో 10 మంది అంగన్‌వాడీ బాలలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ పాఠశాల హెచ్‌ఎం ప్రభాకర్‌వర్మ, ఎఎన్ఎం పి.నాగమణి, మహిళా పోలీసు లీలారాణి, వెల్ఫేర్ అసిస్టెంట్ పరంజ్యోతి, అంగన్‌వాడీ వర్కర్స్ యేసు రత్నకుమారి, సత్యవతి, సుందరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గ్రాడ్యుయేషన్ డేలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఘనంగా బొజ్జా తారకం జయంతి

ప్రజాశక్తి-కడియం

పొట్టిలంకలో అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం బొజ్జా తారకం జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర సెక్రటరీ కోణాల లాజరు కేక్ కట్ చేశారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా వెంకటరత్న రాజు మాట్లాడుతూ బొజ్జతారకం హైకోర్టులో న్యాయవాదిగా దళితులపై దాడులు, అత్యాచారాలు, హత్యలు జరిగినప్పుడు ఉద్యమాలకు న్యాయకత్వం వహించారని, కోర్టుల్లో న్యాయపోరాటం చేసేవారని తెలిపారు. కారంచేడు నరమేధం తర్వాత హైకోర్టు ప్రభుత్వ న్యాయవాది పదవికి రాజీనామా చేసి దళిత మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు అయ్యారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నక్కా చంటి బాబు, అంబటి రాజారత్నం, రేముల్లా ఏసు, కొల్లపు వీరన్న, బెల్లామను శివాజి, మొఘలపు రాజు, గుర్రం రాజు, గుమ్మడి అర్జున్, జక్కల నాని, బడుగు వెంకీ, యాళ్ల సురేష్, దాసి సంతోష్, నెల్లి నవీన్, పల్లి భీమరాజు, బడుగు యోహాను, తదితరులు పాల్గొన్నారు.



తారకంకు నివాళులర్పిస్తున్న దళిత నాయకులు

బాధితులకు మానవ హక్కుల సంఘం పరామర్శ

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో అతిసారా వ్యాధి లక్షణాలతో చికిత్స పొందుతున్న రోగులను జిల్లా మానవ హక్కుల సంఘం అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ గురువారం పరామర్శించారు. వాంతులు, విరోచనాలతో బ్రౌన్‌పేట, కుమ్మరివీధి ప్రాంతాలకు చెందిన పలువురు చికిత్స పొందుతుండగా వారి యోగ క్షేమాలను అప్పలకొండ అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ పి.అమలను కలిసి పట్టణంలో అతిసార పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. కొత్తకేసులు నమోదు కాలేదని డాక్టర్ అమల చెప్పారు. ఈ పర్యటనలో సంఘం నాయకులు ఎస్.రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న అప్పలకొండ

తిరుపతిలో పారిశుధ్యం పనులు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సర్పంచ్ మొయిళ్ళ కృష్ణమూర్తి పర్యవేక్షణలో పంచాయతీ అధికారులు, సిబ్బంది గ్రామంలో పరిశుభ్రత పనులు చేపట్టారు. చెత్త పోగులను తొలగించటం, మురుగు కాలువల్లో పూడిక తొలగింపు, మంచినీటి సరఫరా ట్యాంకులను శుభ్రం చేస్తున్నారు. అలాగే వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటికి వెళ్లి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారు.

నర్సరీల్లో అపారమైన వృక్ష సంపద

కడియం : అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన కడియం నర్సరీల్లో అపారమైన వృక్ష సంపద పరిరక్షణలో రైతుల కృషి అభినందనీయమని హైదరాబాద్ ఎటిఎఆర్ఐ డైరెక్టర్లు డాక్టర్ షేక్ ఎన్.మీరా, డాక్టర్ ఆర్‌కె.మాధుర్ అన్నారు. 72 మంది కృషి విజ్ఞాన కేంద్రాల సీనియర్ శాస్త్రవేత్తల బృందం కడియపులంక శ్రీ సత్యదేవ నర్సరీలోని స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఉద్యానవన మొక్కలను గురువారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాధూర్, షేక్ ఎన్.మీరా మాట్లాడుతూ దేశ, విదేశీ ఉద్యానవన సంపద ఒకేచోట నిక్షిప్తమైన ఏకైక ప్రదేశం కడియం ప్రాంతమని చెప్పారు. రాబోయే రోజుల్లో నర్సరీలు ఒక ఉద్యానవన హబ్‌గా మారగలవని అన్నారు. ఈ నర్సరీలలో ఉన్న కొన్ని వేల రకాల మొక్కజాతులు వాటి శాస్త్రీయ నామాలు గురించి క్షుణ్ణంగా తెలుసుకోవచ్చునన్నారు.

ప్రతీ నియోజకవర్గంలో గురుకులాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ, ఓసి సామాజికవర్గాల్లోని పేద పిల్లల కోసం ప్రతీ నియోజకవర్గానికి ఒక గురుకులం పాఠశాలను ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ ఛైర్మన్ డాక్టర్ పిల్లా చంద్రం ఓ ప్రకటనలో కోరారు. గత టిడిపి ప్రభుత్వం ప్రతి జిల్లాకు ఒక నూతన గురుకుల పాఠశాలను ఏర్పాటు చేసే విధంగా ఆర్డినెన్స్ జారీ చేసిందని, అయితే వైసిపి అధికారం లోకి వచ్చాక వాటిని రద్దు చేసిందన్నారు. తిరిగి టిడిపి అధికా రంలోకి రావడంతో ప్రతి నియోజకవర్గంలో బాల బాలికలకు నూతన గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలని కోరారు.

'తాగునీటి పరీక్షలు నిర్వహించాలి'

ప్రజాశక్తి - కాకినాడ

గ్రామాలు, పట్టణాలు, నగరాలు అన్న తేడా లేకుండా అతిసార వ్యాధి ప్రబలతుందని, కావున తక్షణమే తాగునీటిని ఆయా ప్రాంతాల వారీగా పరీక్షించాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఓ ప్రకటనను విడుదల చేశారు. పలు ప్రాంతాల్లో 40 శాతం కుళాయి పైపులైన్లు మురుగు కాలువల్లో ఉన్నాయన్నారు. అత్యధిక ప్రాంతాల్లో 25శాతం లీకేజీలు ఉన్నాయని అన్నారు. అందుకే తాగునీరు లేత ఆకుపచ్చ రంగులోకి మారిపోతుందన్నారు. ఆ నీటినే ప్రజలు తాగుతున్నారని అన్నారు. కావున తక్షణమే తాగునీటి పరీక్షలతోపాటు, నీటి సరఫరా పైపులైన్‌లను మార్పు చేయాలని ఆయన కోరారు.

మహిళలకు పని ప్రదేశంలో భద్రత

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

పని చేసే ప్రదేశంలో మహిళలు లైంగిక వేధింపులకు గురికాకుండా, మహిళల రక్షణ కమిటీ' ఏర్పాటు చేసి నివేదిక అందచేయాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ స్పష్టం చేశారు. గురువారం కలక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలతో ఐసిడిఎస్ పీడీ కె.విజయ కుమారి, డిఆర్‌ఒ జి.నరసింహులుతో కూడిన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిం చారు. ఈ సందర్భంగా తేజ్‌భరత్ మాట్లాడుతూ, పని చేసే ప్రదేశంలో మహిళలు లైంగిక వేధింపుల ఫలితంగా భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ '14, 15 హెచ్ ప్రకారం లింగ సమానత్వం కోసం స్త్రీ ప్రాథమిక హక్కు, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం గౌరవంగా జీవించే, జీవించే హక్కు, ఏదైనా వృత్తిని అభ్యసించే హక్కు లేదా లైంగిక వేధింపులకు గురికాకుండా సురక్షితమైన వాతావరణానికి హక్కును కలిగి ఉన్నారన్నారు. అందులో భాగంగా మహిళలు స్వేచ్ఛగా భద్రతా కలిగి ఏదైనా వృత్తి, వ్యాపారం లేదా వ్యాపారాన్ని నిర్వహించడానికి అనువైన వాతావరణం కలిగి ఉండేలా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. దీనిలో భాగంగా ఆయా పనిచేసే ప్రదేశాల్లో అంతర్గత కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. అంతర్గత ఫిర్యాదుల కమిటీ అన్ని పరిపాలనా కేంద్రాల్లో లేదా కార్యాలయాల్లో తక్షణం ఏర్పాటు చేస్తూ, వారి వివరాలతో కూడిన నివేదిక అందచేయాలని పేర్కొన్నారు. ఐసిడిఎస్ పీడీ కె.విజయ కుమారి మాట్లాడుతూ, మహిళలకు పని చేసే ప్రదేశంలో భద్రతకు సంబంధించి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్టు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెసి తేజ్ భరత్

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం



ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ